



## కులగణనకు సహకరిస్తాం

**జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్**

తాండూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మరోసారి కులగణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తి స్థాయిలో సర్వే జరగలేదని, అనేక బీసీ సంఘాలు, మేధావులు నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. 16 నుంచి 28 వరకు మరోసారి కులగణనకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్ల చట్టబద్ధతకు చట్టం చేయాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటివరకు కులగణనలో పాల్గొనని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసే సర్వే సిబ్బందికి బీసీ సంఘం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసింది. తాండూరు మండల పరిధిలోని కోటబాస్పల్లి పంచాయతీ కార్యదర్శి లాలప్పను పెద్దేముల్‌కు, సంకిరెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి శిరీషను చిట్టిఘనాపూర్‌కు, చిట్టిఘనాపూర్ కార్యదర్శి నవనీతను గోనూరుకు బదిలీ చేశారు. గోనూరు పంచాయతీ కార్యదర్శి రషీద్‌ను రిజర్వ్‌లో ఉంచారు. అకస్మాత్తు బదిలీపై కార్యదర్శులు కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులను కలిశారు. కాగా, సాధారణ బదిలీ చేసినట్లు వారు తెలిపారు.



## సేవాలాల్ జయంతి ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

దుద్యాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో రేపు నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బావల్లి సంతోష్‌నాయక్, శివచౌహన్, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, రవినాయక్, రాజునాయక్, రాహుల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చిరుతను చూసిన వారితో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

## బీరోల్-మదనపల్లి సరిహద్దుల్లో చిరుత

- రోడ్డు దాటుతుండగా చూసిన గ్రామస్తులు
- పరిసరాల్లో అటవీ అధికారుల అన్వేషణ

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం వికారాబాద్ అటవీ రేంజ్ పరిధిలోని అనంతగిరి ఘాట్ అడవిలో కనిపించిన చిరుత గురువారం మదనపల్లి - బీరోల్ గ్రామ సరిహద్దుల్లో మరోసారి గ్రామస్తుల కంటపడింది. బీరోల్ గ్రామానికి చెందిన రైతు విజయ్‌కుమార్ అటుగా వెళ్తుండగా చిరుత రోడ్డు దాటుతూ కనిపించింది. వెంటనే ఆయన గ్రామస్తులతో కలిసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు ఆ పరిసరాలకు వెళ్లి చిరుత జాడ కోసం అన్వేషించారు. చిరుత పాదముద్రల ఆనవాళ్ల కోసం పరిశీలిస్తున్నామని అటవీ సెక్షన్ అధికారి అరుణ తెలిపారు. కాగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అడవిలోకి, పొలాలకు వెళ్లొద్దని ఆమె సూచించారు. చిరుత మనుషులపై దాడి చేసే అవకాశం తక్కువగా ఉంటుందని అయినా కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# స్థానికంపై నజర్!

## ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాంగ్రెస్

- అధికార పార్టీ ఎమ్మెల్యేలకు అగ్ని పరీక్షే..!
- సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు
- వేడెక్కుతున్న పల్లె రాజకీయం



త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రాగానే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు వీలుగా ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఎక్కువ స్థానాలను కైవసం చేసుకుని సత్తా చాటాలని అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ, ఇతర పక్షాలు సైతం పట్టుదలతో ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారు ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్న నేపథ్యంలో ఢీ.. అంటే ఢీ... అన్న విధంగా తలపడనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలను అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ సత్తాకు, ప్రభుత్వ పనితీరుకు బల పరీక్షగా భావిస్తున్నారు.

వికారాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పాలనకు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు గీటురాయిగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను సవాల్‌గా, అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీటీసీ స్థానాల్లో మెజార్టీ స్థానాలను తమ ఖాతాలో వేసుకునే దిశగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. అధికార పార్టీకి గట్టిపోటీనిచ్చి ఎక్కువ స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కాలంలో

మిగతా 8వ పేజీలో...

### త్వరలో తేలనున్న రిజర్వేషన్లు

త్వరలో పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తుల రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. డెడికేషన్ కమిషన్ నివేదిక అందిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ మేరకు బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారనేది తెలియాల్సి ఉంది. ఆ తర్వాత సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ, జెడ్పీ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. మున్సిపల్ వార్డులు, చైర్మన్ పదవుల రిజర్వేషన్లపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం 2019లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేసిన రిజర్వేషన్లు రెండు విడతలకు వర్తించే విధంగా పంచాయతీరాజ్ చట్టంలో సవరణ చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిజర్వేషన్లు ఒకే విడత వర్తించేలా చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే.




# ఫీజులుం

## విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న స్కూళ్ల యాజమాన్యాలు

- సకాలంలో చెల్లించలేక ఆందోళనలో తల్లిదండ్రులు
- అవమానంతో తనువు చాలిస్తున్న విద్యాకుసుమాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు




మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం రెండు, మూడు నెలల్లో ముగియనుంది. ఒక వైపు విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధమవుతుండగా, మరో వైపు విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజులను వసూలు చేయడానికి తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచారు. ఫలితంగా సమయానికి ఫీజు చెల్లించలేక తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫీజులు చెల్లిస్తేనే.. పరీక్షలకు అనుమతిస్తామని విద్యాసంస్థలు తేల్చి చెప్పడంతో వారికి దిక్కుతోచని పరిస్థితిగా మారింది. ఫీజుల వసూళ్ల విషయంలో తోటివారి ముందు అవమానకరంగా మాట్లాడుతుంటంతో

మిగతా 8వ పేజీలో...

### ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు..

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాలలో ఫీజు చెల్లించని కొందరు విద్యార్థులను ఇటీవల పాఠశాల ఆవరణలో రోజంతా కూర్చోబెట్టారు. మరో ప్రైవేటు పాఠశాలలో రూ.400 ఫీజు పెండింగ్‌లో ఉందని విద్యార్థిని పరీక్షకు అనుమతించలేదు. ఫీజు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్న తీరుతో విద్యార్థులు స్కూళ్లకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఫీజులు వసూలు చేయడానికి పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా కొంత మంది సిబ్బందికి టార్గెట్ ఇచ్చి నియమిస్తున్నారు.

## పాఠశాల గుర్తింపు రద్దుకు డిమాండ్

- విద్యార్థిని ఆత్మహత్యను నిరసిస్తూ ఆందోళన
- పాఠశాల ఆవరణలో ఫర్నిచర్ ధ్వంసం
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



పాఠశాల ఆవరణలో ధ్వంసమైన ఫర్నిచర్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనను నిరసిస్తూ గురువారం విద్యార్థి సంఘాలు, బీజేపీ నాయకులు మేడ్చల్‌లోని ఆ పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. ప్రిన్సిపాల్ స్కూల్ ఫీజు విషయమై మందలించడంతో పదో తరగతి విద్యార్థిని అఖిల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థి సంఘాల నాయకులు

మిగతా 8వ పేజీలో...



మంత్రి పొన్నంతో జైపాల్‌రెడ్డి

## ఉత్తమ సేవలందిస్తాం

- మంత్రి పొన్నంను కలిసిన ఆర్టీఏ సభ్యుడు జైపాల్

శామీర్‌పేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం ఆయన నివాసంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి కలసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. జైపాల్‌రెడ్డిని ఆర్టీఏ సభ్యుడిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించినందుకు కాంగ్రెస్ పార్టీకి, రవాణా శాఖకు ఉత్తమ సేవలందిస్తానని స్పష్టం చేశారు.

## పన్ను వసూళ్లలో తాండూరు లాస్ట్

- పేరుకుపోయిన ట్యాక్స్‌లు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

వివరాలు 7లో..



కొనుగోలు కేంద్రంలో ధాన్యం(ఫైల్)

## రైతులకు అందని బోనస్

**సన్నాలు విక్రయించి దాదాపు 2 నెలలు పూర్తి**

- పెండింగ్‌లో రూ.22 లక్షలు
- ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సన్న వడ్ల క్వింటాల్‌కు రూ.500 బోనస్ అని ప్రకటించిన ప్రభుత్వం.. రైతులు ధాన్యం విక్రయించి దాదాపు రెండు నెలలు కావస్తున్నా బోనస్ జాడ లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వర్షాకాలంలో సాగైన వరిధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాల ద్వారా 5,453 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించారు. ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు రైస్‌మిల్లర్లకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులను కూడా వెంటనే చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాని రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు బోనస్ డబ్బులు చెల్లించడం లేదు. జిల్లాలో రూ.42 లక్షల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉండగా అందులో సగం వరకు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ. 22 లక్షలు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంట నాటు వేసే వరకైనా డబ్బులు వస్తే కొంత ఆసరాగా ఉండేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎదురుచూస్తున్నాం..



ధాన్యం కొనుగోలు కేంద్రంలో 40 క్వింటాళ్ల సన్నాలను విక్రయించాను. రెండు నెలల పూర్తవుతున్నా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు రాలేదు. యాసంగి సాగు వరకైనా వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం. కానీ ఇప్పటివరకు ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు చెల్లించాలి.

-నాగుల ప్రహ్లాద్‌గౌడ్, రైతు, జగన్‌గూడ

### త్వరలోనే జమ చేస్తాం..



జిల్లాలో సగం రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాం. ఇంకా సగం మందికి రూ.22 లక్షలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం వద్దనే పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం నుంచి త్వరలోనే డబ్బులు రాగానే రైతుల ఖాతాలో జమ చేస్తాం.

-సుగుణాబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

## వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- డీఈవో విజయకుమారి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న డిజిటల్ తరగతులను, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో విజయకుమారి

విద్యార్థులకు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భర్తను హతమార్చిన భార్య

- ప్రియుడితో కలిసి ఘాతుకం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్నాడని భావించిన భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది. మృతుడి తండ్రి అనుమానంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో అసలు విషయం బయటపడింది. 10వ తేదీన మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నూనావత్ రమేశ్(30) కేసు మిస్టరీని పోలీసులు ఛేదించి భార్య లలిత(28), ప్రియుడు నర్సింహను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా ఎస్ కొండాపూర్ తండాకు చెందిన నూనావత్ రమేశ్, ఉపాధి కోసం మేడ్చల్ పట్టణంలోని కిందిబస్తీలో స్థిరపడ్డాడు. రమేశ్ భార్య లలితకు స్థానికంగా ఉండే వికారాబాద్ జిల్లా నీటూరు నర్సాపూర్ గ్రామానికి చెందిన నర్సింహతో పరిచయం ఏర్పడింది. తరుచు ఇరువురు ఫోన్‌లో మాట్లాడటం గమనించిన రమేశ్ భార్య లలితను పలుమార్లు మందలించాడు. అయినప్పటికీ తన తీరు మార్చుకోక పోవడంతో భార్యభర్తల మధ్య గొడవలు పెరిగాయి. దీంతో తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుతొలగించుకోవటానికి ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఫిబ్రవరి 9న రాత్రి 11 గంటలకు రమేశ్ తాగి వచ్చి ఇంట్లో గొడవ పడి నిద్రపోయాడు. ఇదే అదునుగా భావించిన లలిత నర్సింహను పిలిచి ఇద్దరు కలిసి టవల్‌తో గొంతు నులిమి హతమార్చారు. మృతదేహాన్ని బస్తీలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేశారు. 10న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచాచం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గొంతుపై నులిమిన గాయాలను చూసి భార్యను విచారించారు. అనంతరం మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ జరపగా తనకు అడ్డు తగులుతున్నాడన్న కోపంతో ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చినట్టు లలిత పోలీసుల ఎదుట ఒప్పుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

కులకచర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక ఎన్నికలకు రాజకీయ నాయకులు సహకరించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో తప్పులుంటే తెలియజేయాలన్నారు. ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలకు ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు.


స్థల పరిశీలన చేస్తున్న కేంద్ర బృందం, స్థానిక అధికారులు

## నవోదయ పాఠశాలకు స్థల పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం నవోదయ కేంద్ర బృందం సభ్యుడు, నవోదయ పాఠశాలల నిర్మాణ జనరల్ మేనేజర్ జీవీరెడ్డి గురువారం మేడ్చల్ జిల్లా ప్రతాప్‌సింగారంలో స్థల పరిశీలన చేశారు. ప్రతాప్‌సింగారంలోని సర్వే నంబర్ 378లో ఉన్న ప్రభుత్వ భూమిలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు పరిశీలించారు. ఈ భూమిలో ఏమైనా సమస్యలున్నాయా? అనే విషయంపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నవోదయ పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉందని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బృందం వెంట డీఈవో విజయకుమారి, తహసీల్దార్ డీఎస్.రజని, ఆర్‌ఐ కావ్యరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## మాజీ సీఎంను కలిసిన నాయకులు


కేసీఆర్‌తో శుభప్రద్, విజయ్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో ఆయను కలిసి వికారాబాద్ జిల్లా రాజకీయాలపై చర్చించారు. రానున్న రోజులన్నీ బీఆర్ఎస్‌వేనని కేసీఆర్ అన్నారని నాయకులు తెలిపారు.


'జై సేవాలాల్' సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

## 'జై సేవాలాల్' పాటల సీడీ ఆవిష్కరణ

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి పంచాయతీ హామ్లెట్ మక్తతండాకు చెందిన వీరేందర్ బంజారాల దైవం సేవాలాల్ మహరాజ్‌పై పాటలు పాడుతున్నాడు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని అతడు రూపొందించిన పాటల సీడీని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, సుదర్శన్, శ్యామ్‌లు గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతిపై రూపొందించిన పాటలు బంజారాల సంస్కృతిని తెలియజెప్పేలా ఉన్నాయని సీడీ రూపకర్తలు, ఆవిష్కర్తలు అన్నారు. కార్యక్రమంలో సింగర్ వీరేందర్, మురళీజాదవ్, ఈశ్వర్, నవీన్, గుండు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


లేబర్ కార్యాలయం వద్ద కార్మిక సంఘం నాయకులు

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కరణ్‌కోట ఫ్యాక్టరీ కార్మిక సంఘం ప్రతినిధి పాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శరణప్ప అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సునీల్‌కుమార్‌ను కలిసి కార్మిక సమస్యలపై వివరించారు. ఈ నెల 25వ తేదీలోపు ప్రతీ కార్మికుడికి పెండింగ్‌లోని రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వేతనాలు, డ్రెస్సులు, బూట్లు, హెల్మెట్, దసరా గిఫ్ట్ రూ.2వేలు ఇవ్వాలని కోరారు. వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీసీఐ యాజమాన్యం పెండింగ్ వేతనాలిస్తామని గతంలోనే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారులతో చర్చల్లో రైల్వే కార్మికులు ఎల్లప్ప, శీను, అనంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ రంగ/సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ కోరికను నెరవేర్చాలని నేటి నుంచి మూడు రోజుల పాటు పట్టణంలో పనులను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. చాలీచాలని కూలితో సెంట్రింగ్ కార్మికుల బతుకు దుర్భరంగా మారిందన్నారు. తమ డిమాండ్‌కు భవన యజమానులు మద్దతివ్వాలని, స్లాబ్ ప్రతీ ఫీట్‌కు రూ.130 చొప్పున ధర చెల్లించాలన్నారు. శుక్రవారం ఉదయం ఆలంపల్లి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న రంగారెడ్డి ఎక్సైజ్ కమిషనర్ దశరథ్

## నాన్‌డ్యూటీ మద్యాన్ని అరికట్టాలి

- సమీక్షలో డిప్యూటీ కమిషనర్ దశరథ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నాన్ డ్యూటీపెయిడ్ మద్యాన్ని అరికడితేనే మద్యం అమ్మకాలు పెరగుతాయని, అక్రమ మద్యంపై నిఘా పెట్టాలని రంగారెడ్డి ఎక్సైజ్ కమిషనర్ పి.దశరథ్ అన్నారు. గంజాయి, డ్రగ్స్‌తోపాటు నాన్‌డ్యూటీ పెయిడ్ అమ్మకాలను గట్టి నిఘా పెట్టి అరికట్టాలని సూచించార. హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎక్సైజ్ అధికారులతో చర్చించారు. గత నెలలో ఎక్సైజ్ అధికారుల పనితీరును పరిశీలించి మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. డిస్పోజల్ కమిటీ అనుమతితో పలు స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేసి పట్టుబడిన వాహనాలను వేలం వేయాలని సూచించారు. సమావేశంలో డీసీతోపాటు అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వల రెడ్డి, ఫయాజుద్దీన్, నవీన్, విజయభాస్కర్, ఏఈఎస్, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## దైవ సేవకులపై దాడులు సరికాదు


రంగరాజన్‌తో మాట్లాడుతున్న ముజఫర్ అలీ

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నిత్యం భగవంతుని సేవలో ఉండే వారిపై దాడులు మంచి పద్ధతి కాదని, అది ఎవరు చేసినా శిక్షార్హమేనని హైదరాబాద్‌లోని హజ్రత్ షేక్జీహలీ దర్గా నిర్వాహకుడు ముజఫర్ అలీ సూఫీ అన్నారు. గురువారం ఆయన చిల్కూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. సంస్కృతి, సంప్రదాయాలను భక్తులకు ఓపికతో వివరించే రంగరాజన్‌పై దాడి దురదృష్టకరమన్నారు. ఇటీవల తాము హైదరాబాద్‌లో నిర్వహించిన సూఫీ బసంత్‌లో రంగరాజన్ పాల్గొని సర్వమతాల సారం సమాజ శాంతే అని అన్నారని గుర్తుచేశారు.


పరామర్శిస్తున్న ఎస్సీ రిజర్వేషన్ సమితి సభ్యులు

### దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆమనగల్లు: అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి ఉప్పుల నర్సింహ అన్నారు. బాలాజీ ఆలయంలో రంగరాజన్‌ను నర్సింహ పరామర్శించారు. రామరాజ్యం పేరుతో ఓ వ్యక్తి రంగరాజన్‌పై దాడిని ప్రతొక్కరు ఖండించాలన్నారు. పరామర్శించిన వారిలో బలరామ్, దేవేంద్రప్ప, సుమలత ఉన్నారు.

# పన్ను వసూళ్లలో తాండూరు లాస్ట్!

## బల్దియాలో పేరుకుపోయిన ట్యాక్స్‌లు


పన్ను వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

తాండూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రంలోని 152 మున్సిపాలిటీల్లో తాండూరు లాస్ట్‌లో ఉంది. పన్ను వసూళ్లపై ఆరు నెలలుగా మున్సిపల్ రెవెన్యూ విభాగం పట్టించుకోక, ఉన్నతాధికారి పర్యవేక్షణ లేక ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడ్డారు. ప్రస్తుతం 16శాతం పన్నులే వసూలు చేశారు. మున్సిపాలిటీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 36వార్డుల్లో రూ.13.4కోట్ల ట్యాక్స్ రావాల్సి ఉండగా ఈ నెల 5వ తేదీ వరకు రూ.2.75కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ మున్సిపాలిటీలో 8 రెవెన్యూ వార్డులున్నాయి. వచ్చే మార్చి 31 నాటికి రూ.11కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం ఉంది. ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు, బిల్‌కలెక్టర్లు, జవాన్లతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమొస్తే పాత బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తామని ఎన్నికల్లో నాయకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు మిత్తి లేకుండా పన్ను తీసుకోవాలని ఇళ్లకు వెళ్తున్న సిబ్బందిని ప్రజలు కోరుతున్నారు. వడ్డీ మాఫీ చేస్తేనే పన్ను కడతామని అంటున్నారు. మరోవైపు పన్ను కట్టకుంటే రెడ్ నోటీసులిచ్చి ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### వసూళ్లను ఖజానాలో జమచేయని జవాన్

ఇదిలా ఉంటే తాండూరు మున్సిపాలిటీలోని ఓ అధికారికి సన్నిహితంగా ఉండే ఓ జవాన్‌కు పన్ను వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. అతడు వ్యాపారుల నుంచి పన్ను డబ్బులు తీసుకొని రశీదు ఇవ్వకుండా స్వాహా చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. తాము ట్రేడ్ ట్యాక్స్‌ను ఇప్పటికే చెల్లించామని, రిసిప్ట్‌మాత్రం ఇవ్వలేదని ట్యాక్స్ వసూళ్లకు పోతున్న సిబ్బందితో వ్యాపారులు వాపోతున్నారు. బల్దియా డబ్బును సొంతానికి వాడుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

## కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి


స్థల పరిశీలన చేస్తున్న జైపాల్‌యాదవ్, వెంకటేశ్, దశరథ్, అనురాధపత్య తదితరులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను దగాచేసిందన్నారు. ఆమనగల్లులో ఈ నెల 18న బీఆర్ఎస్ నిర్వహించే రైతు దీక్ష విజయవంతానికి గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిచే రైతుదీక్ష సభాస్థలాన్ని నాయకులు పరిశీలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కాగా జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు అనురాధపత్యానాయక్, దశరథ్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలు సభాస్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టేందుకు రైతుదీక్ష చేపడుతున్నామని, సభకు నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని జైపాల్ కోరారు. కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నించే గొంతులను అణచేస్తోందనిఆరోపించారు. పంటల రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, లచ్చీరామ్, సరితపంతూ, రమేశ్‌నాయక్, బాలస్వామి, డి.వెంకటేశ్, గణేశ్, శివ, సైదులుగౌడ్, సాయిలు, సతీష్, ప్రవీణ్, శివకుమార్, హేమ్ల పాల్గొన్నారు.


నీటి సమస్య పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయించిన మహిళలు

## తాగునీటి సమస్య తీర్చాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టేకుల్‌కోడ్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. వారం రోజుల క్రితం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. ఈ సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి వాటర్‌గ్రిడ్ అధికారులకు తెలిపారు. అయితే మెయిన్ పైప్‌లైన్‌కు రిపేరు చేసినా ఒక కాలనీకి నీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ వివరణిస్తూ.. సీసీ రోడ్డు వేసిన సమయంలో పైప్‌లైన్ కొన్నిచోట్ల బ్లాక్ కావడంతో నీరు రావడం లేదన్నారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

## మరింత భూసేకరణ సిగ్గుచేటు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 'ఫార్మాసిటీని రద్దు చేస్తాం. ఇకపై భూసేకరణ చేయం.' అని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అదనంగా 30వేల ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం అనుకోవడం సిగ్గుచేటని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. గురువారం మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భూసేకరణలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేదలకు అన్యాయం చేశాయన్నారు. ఏవేవో అవసరాలకు 30వేల ఎకరాలు సేకరించేందుకు యాచారం మండల పరిధి గ్రామాల్లోని అస్సైన్డ్ భూములపై ప్రభుత్వం కన్నేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాటి మోతబరి రైతులు నేడు కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బాస్, మండల, జిల్లా కమిటీల నాయకులు ఆలంపల్లి నర్సింహ, శ్రీనివాస్, కె.జగన్, జంగయ్య, వినోద్‌కుమార్, విప్లవ్‌కుమార్, వెంకటయ్య, ఐలయ్య పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

## చెన్నకేశవాలయంలో పెద్ద రథోత్సవం

కడ్తాల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కడ్తాలలోని ప్రసిద్ధ శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారు జామున స్వామివారి బ్రహ్మ రథోత్సవం(పెద్దతేరు) నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉత్సవ విగ్రహాలతో ఉన్న రథాన్ని లాగి మొక్కు తీర్చుకున్నారు. పర్యవేక్షకులు వెంకటేశ్వరశర్మ, అర్చకులు వేణుగోపాల్, శ్రీధర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్, నర్సింహమూర్తిల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ శివప్రసాద్, నాయకులు కడారి రామకృష్ణ, జంగారెడ్డి, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, బిక్షపతి, మహేశ్, రాములు, వెంకట్‌రెడ్డి, సత్యం, బుచ్చయ్య, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాల్ ప్రతిభ



ఆమనగల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 పరీక్షలో మేడిగడ్డతండాకు చెందిన వడ్త్యావత్ విశాల్ ప్రతిభ కనబరిచాడు. ఆమనగల్లు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విశాల్ జేఈఈ రాసి ఎన్టీఏ స్కోర్ 83.87 సాధించాడని ప్రిన్సిపాల్ ఆర్.మాధవరావు, ఫిజిక్స్ అధ్యాపకుడు కృష్ణయ్య గురువారం తెలిపారు. విశాల్‌ను, అతడి తల్లిదండ్రులు సరోజ, లక్ష్మణ్‌లను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## నాసర్ పోలో గ్రౌండ్‌లో ఈక్వెస్ట్రియన్ క్రీడలు



శంకర్‌పల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని నాసర్ పోలో గ్రౌండ్ ఈక్వెస్ట్రియన్ క్రీడలకు వేదిక కానున్నది. ఈ నెల 22, 23 తేదీల్లో ఈక్వెస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహిస్తామని గురువారం నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడల్లో గుర్రపు స్వారీ, జంపింగ్, పోలో తదితర క్రీడలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ గెలిచే వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారన్నారు. ఉత్సాహవంతులైన రైడర్లు పాల్గొనాలని కోరారు.

## కరెంట్ బిల్లు రూ.1.41లక్షలు!

- విద్యుత్ కాంట్రాక్టర్ ఇంటి కనెక్షన్ కట్
- సర్వీసు కేటగిరీ మార్చకనే భారీ బిల్లు


రూ.1.41లక్షల బిల్లును చూపుతున్న శివదర్శన్

వికారాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రూ.1.41లక్షల కరెంట్ బిల్లు కట్టలేదని అధికారులు కనెక్షన్ కట్ చేసిన ఘటన వికారాబాద్‌లో గురువారం జరిగింది. వికారాబాద్ సాకేత్ నగర్ కాలనీకి చెందిన స్వరూప ఇంటికి మొదట కేటగిరీ-2 కింద మీటర్ బిగించారు. తరువాత దానిని కేటగిరీ 8కి మార్చడంతో కరెంట్ బిల్లు క్రమంగా పెరుగుతూ రూ.1.41లక్షలు వచ్చింది. బిల్లు కట్టలేదని అధికారులు కనెక్షన్ కట్‌చేశారు. దీనిపై స్వరూప భర్త శివదర్శన్ స్పందిస్తూ.. తాను ట్రాన్స్‌కోలోనే కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నానని, విద్యుత్ శాఖలో తన డిపాజిట్ డబ్బు రూ.10లక్షలు ఉన్నాయన్నారు. తాను చేసిన పనులకు రూ.70లక్షల బిల్లు రావాల్సి ఉందని, అధికారులు ఆ బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని, కానీ ఇప్పుడు తన ఇంటి కనెక్షన్ కట్‌చేయడం ఏం న్యాయం ప్రశ్నించారు. తన సర్వీస్‌ను కేటగిరీ 8 నుంచి 2లోకి మార్చాలని 14 నెలల క్రితమే దరఖాస్తు చేసినా పరిష్కరించకుండా లక్షల్లో బిల్లులు వేశారని వాపోయాడు.

## రోడ్ల పక్కన పెంచిన మొక్కలకు నిప్పు


కాలిపోయిన మొక్కలు




యాచారం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దుండగుల నిర్వాకంతో ఏపుగా పెరిగిన మొక్కలు కాలిపోయాయి. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న గడ్డికి నిప్పటించడంతో చిన్నతూండ్లలో 10 మొక్కలు కాలిపోయాయి, మొక్కలు ఏపుగా పెరిగాయి. పంచాయతీ సిబ్బంది నీరు పోసేవారు. దుండగులు నిప్పటించడంతో మొక్కలన్నీ కాలిపోయాయి. నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారిపై నీరిచ్‌మోడ్ హోటల్ సమీపంలో బుధవారం రాత్రి దుండగులు నిప్పటించడంతో 15చెట్లు కాలిపోయాయి. తమ్మలోనిగూడ పంచాయతీ సిబ్బంది వారం వారం చెట్లకు నీరుపెట్టి పెంచారు. దుండగుల చర్యలతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## లక్ష్మీపల్లిలో అంతా బీసీలే!


పంచాయతీ కార్యాలయం

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఊరు అంటే అన్ని కులాలు, మతాల ప్రజలుంటారు. కానీ అక్కడ మాత్రం అందరూ బీసీ కులస్తులే ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనార్టీలు ఎవరూ లేని గ్రామంగా లక్ష్మీపల్లి ప్రత్యేకతను సంతరించుకొంది. కొడంగల్ మండలం లక్ష్మీపల్లిలో 250 కుటుంబాలున్నాయి. 240 ముదిరాజ్, 10 కురవ కుటుంబాలున్నాయి. వెయ్యి మంది జనాభా, 600 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామ జనాభా మొత్తం బీసీలే! ఇది గతంలో పక్క గ్రామం సంగాయిపల్లితో పంచాయతీగా ఉండేది. కొన్నేళ్ల కిందనే పంచాయతీగా ఏర్పాటైంది. కాగా గ్రామస్థుల వ్యవసాయంపై ఆధారపడ్డారు. కూరగాయలు పండించి సమీప గ్రామాల్లో అమ్ముతుంటారు. చాకలి, మంగళి, కమ్మరి తదితర కులవృత్తుల వారు పక్క గ్రామం అంగడి రాయచూర్ నుంచి వచ్చి పనులు చేస్తారు. ఈ గ్రామంలో అందరూ బీసీలే కాబట్టి అన్ని కులాలకూ రాజకీయ పదవులు అవకాశం లభించే అవకాశం ఉంది.


లక్ష్మీపల్లి గ్రామ వ్యూ

# 'స్థానికం'పై నజర్!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజాతీర్పు పార్టీకి, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే విధంగా కృషి చేయాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

**అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి**

ఇదిలా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రజల్లో ఎండగట్టి తమ సత్తా చాటుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలు తీరుపై ప్రజల్లోనే తేల్చుకునేందుకు ఆ రెండు పార్టీలు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇవే తొలి ఎన్నికలు కావడంతో ప్రజల్లోకి వెళ్లి వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వికారాబాద్ నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై శ్రేణులకు ఎన్నికలపై దిశా నిర్దేశం చేసిన విషయం తెలిసిందే. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం, కోస్గిలో నిర్వహించిన రైతు ధర్నాకు సైతం ఆయన హాజరయ్యారు.

ఆ మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకమే..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కొనసాగుతున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గం నుంచి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, పరిగి నియోజకవర్గం నుంచి రామ్మోహన్‌రెడ్డి, తాండూరు నియోజకవర్గం నుంచి మనోహర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాలే యాదయ్య శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. నేడో.. రేపో రిజర్వేషన్లు ఖరారు కానున్న నేపథ్యంలో ఏ వర్గానికి రిజర్వు అయితే ఎవరిని ఎన్నికల బరిలోకి దించాలనే విషయమై పార్టీల ముఖ్య నేతలు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత అధికార పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు మండలాల్లో పర్యటిస్తూ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కావాలని భావిస్తున్నారు. ప్రజాదరణ ఉన్న నాయకులనే ఎన్నికల బరిలోకి దించి గెలిపించుకోవాలన్న ఆలోచనలో ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలుస్తుండగా, అదే వ్యూహాన్ని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా అనుసరించనున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ మిగతా ప్రధాన పార్టీల కంటే ముందుగానే ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఉన్న చోట్ల ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించే అవకాశం ఉందని తెలుస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా వ్యూహాత్మకంగా, పోటాపోటీగా తలపడే అవకాశం ఉంది.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

# ఫీజులుం

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు మనస్థాపంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు సైతం చోటుచేసుకుంటున్నాయి. మేడ్చల్ పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల ఫీజు వసూలు చేసే విషయంలో ప్రవర్తించిన తీరును తట్టుకోలేక అఖిల అనే ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

**అందరి ముందు అగౌరవపరుస్తూ..**

మేడ్చల్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో గుర్తింపు పొందిన పాఠశాలలున్నాయి. వీటిలో కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలు ఫీజులు వసూలు చేసే విషయంలో రాజీ పడటం లేదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటులో చదివిస్తే తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు వస్తాయన్న ఆశతో పూటగడవని నిరుపేదలు సైతం తమ పిల్లలను ప్రైవేటులో చదివిస్తున్నారు. అడిగిన ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సరిగా లేని కారణంగా కొన్ని సందర్భాల్లో ఫీజులు సమయానికి చెల్లించలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాల యాజమాన్యాలు నేరుగా విద్యార్థులపై వత్తిడి తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఫీజులు చెల్లించని విద్యార్థులను ఫీజులు చెల్లించిన విద్యార్థుల ఎదుట అగౌరవ పరుస్తున్నారు. అందరి ముందు నిలబెట్టి తల్లిదండ్రులపై వత్తిడి తీసుకొచ్చేందుకు వేధిస్తున్నారు.

**కొరవడిన అధికారుల నియంత్రణ**

విద్యార్థులను పీడించి ఫీజులు వసూలు చేసే పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాధికారులు విద్యాసంస్థల యాజమాన్యాలకు వత్తాసు పలకటంతో దోపిడీ వ్యవస్థ కొనసాగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్యూషన్ ఫీజు పేరుతో వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఆయా విద్యాసంస్థల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుతుండటంతోనే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫీజులు వసూళ్ల విషయంలో విద్యార్థి సంఘాలు ఆందోళనలు, నిరసనలు చేపట్టినప్పటికీ విద్యా సంస్థలు తమ పలుకుబడితో వాటిని అనగదొక్కి తమ పని తాము చేసుకుంటూ దోపిడీ వ్యవస్థను కొనసాగిస్తున్నాయి.

# పాఠశాల గుర్తింపు రద్దుకు డిమాండ్

(5వ పేజీ తరువాయి)

గురువారం పాఠశాల ఆవరణలో ఉన్న బల్లలను, కుర్చీలను, పూల తొట్టీలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చేపడుతున్న వారిని అడ్డుకున్నారు. పాఠశాలకు ముందుగానే సెలవు ప్రకటించడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది లేకపోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు జె.శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాఠశాల ముందు బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు తీశారు. అఖిల కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పాఠశాల వైపు కన్నెత్తి చూడకపోవటంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా శైలజ హరినాథ్ మాట్లాడుతూ విద్యార్థి చావుకు కారణమైన పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు తమ ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజనేయులు, శ్రీనివాస్ గౌడ్, వంశీ విజై, మురళిధర్ గుప్తా, సుధాకర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

**ఎంఈఓ కార్యాలయం వద్ద..**

కాగా, ఎంఈవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన చేపట్టారు. ఆ సమయంలో ఎంఈవో లేకపోవడంతో నాయకులు కార్యాలయంలోని ఖాళీ కుర్చీకి, బందోబస్తులో ఉన్న ఎస్ఐ అశోక్‌కు ఎంఈవో కానబడుట లేదంటూ వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఆ ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేసేంత వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపడుతామన్నారు. స్థానిక పోలీసులు, పాఠశాల, ఎంఈఓ కార్యలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

**అంత్యక్రియల కోసం ఖమ్మంకు తరలింపు**

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అఖిల మృతదేహాన్ని అంత్యక్రియలకు తల్లిదండ్రులు సొంత గ్రామమైన ఖమ్మంకు గురువారం తీసుకెళ్లినట్టు స్థానికులు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నందు

కోట్‌పల్లి, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్, దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రలోని బీజేపీ ప్రభుత్వ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కోట్‌పల్లి మండలంలో జరుగుతున్న సీసీ రోడ్డు, ఫార్మేషన్, సైడ్రైన్ పనులు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నేతృత్వంలో జరుగుతున్నాయన్నారు. రాంపూర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా సమకూర్చలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందూరి శివకుమార్, గ్రామ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బంధ్యయ్య, సుధాకర్ రెడ్డి, రాజు, రవీందర్ రెడ్డి, మాణిక్, బాల్వంత్, మహేశ్ రెడ్డి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



## దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి గాయాలు

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పార్క్ చెసిన ఐదు బైక్‌లతోపాటు రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఇద్దరిని కారు ఢీ కొట్టింది. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి నుంచి కేశవరం మార్గమధ్యలో ఎల్లమ్మ గుడి దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో సిబ్బంది, గ్రామస్తులు బాగు చేసి దాని పనితీరును పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో మూడుచింతలపల్లి నుంచి కేశవరం వైపు వెళ్తున్న మహేంద్ర ఎక్స్‌యూవీ 300 కారును డ్రైవర్ అతి వేగంతో అజాగ్రత్తతో నడుపుతూ రోడ్డు పక్కన పార్క్ చేసిన ఐదు బైక్‌లతోపాటు రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఇద్దరిని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ముమ్మరంగా రేషన్‌కార్డు వివరాల నమోదు

బషీరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో కొత్త రేషన్‌కార్డుదారుల వివరాల నమోదు ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. మండలవ్యాప్తంగా 1900 మంది ఇంటింటి విచారణలో అధికారులు కొత్త కార్డులకు అర్హులుగా గుర్తించారు. ఈ వివరాలను తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ రుక్సానా నేతృత్వంలో ఆర్ఐ నాగర్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు నాలుగు టీంలుగా ఏర్పాడి కంప్యూటర్లలో అర్హుల వివరాలను నమోదు చేస్తున్నారు. కొత్త కార్డుల వివరాలతోపాటు పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకు 1100 దరఖాస్తులు రాగా వాటిని అధికారులు నమోదు చేస్తున్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తాండూరు బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పురందరాచార్య శుక్రవార్, కార్యదర్శి నాగరాజు తదితరులు గురువారం తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగరాజన్‌పై దాడి చేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు గురురాజ్ దీక్షిత్, కోశాధికార సుగంధి, అర్చక పురోహిత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## తొలగించని కంకర.. తప్పని ఇబ్బందులు



తాండూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ రోడ్డు వేసి కంకరను అక్కడే వదిలేశారు. దీంతో వాహనదారులు, పాదాచారులు పడరాని పాట్లు పడుతున్నారు. తాండూరు పట్టణం డీఎస్పీ కార్యాలయం పక్కన గల్లీలో సీసీ రోడ్డు వేశారు. అయితే డీఎస్పీ కార్యాలయం ఎదుట కంకర, ఇసుక వంటి మెటీరియల్ వేసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయి నెల గడుస్తున్నా ఇంతవరకు మిగిలిన మెటీరియల్‌ను తరలించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ధారూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల నాయకులు లబ్ధిదారులకు గురువారం ధారూరులో పంపిణీ చేశారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మందికి వైద్య చికిత్స నిమిత్తం రూ.4.50లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ రాములు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై ఆరా

బషీరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్మాయి పంచాయతీని ఎంపీడీవో విజయ్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు అంశాలపై కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్‌తో చర్చించారు. అక్కడున్న పీఆర్ఏఈ యశ్వంత్‌తో గ్రామంలో ఇటీవల ఏఏ అభివృద్ధి పనులు చేపట్టారని అడిగితెలుసుకున్నారు. అనంతరం అల్లాపూర్ గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

## అర్హులను గుర్తించాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి సదానందం అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా నిర్వహించారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, మాధవి, సుగుణ, రాణి, స్వప్న, వెంకటేశ్వర్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, విక్రంరెడ్డి పాల్గొన్నారు.

**రాజకీయ నేతలతో సమావేశం**

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టులో తప్పులు, నూతన ఓటరు నమోదుపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీవో యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మార్మోగిన శివనామస్మరణ

కోట్ పల్లి, ఫిబ్రవరి13 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని బుగ్గపురం బుగ్గ రామలింగేశ్వర ఆలయం వద్ద గురువారం మాజీ సర్పంచ్ లక్ష్మీవెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన శివ స్వాముల మహాపడి పూజ శివనామస్మరణతో మార్మోగింది. స్వాములు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# రేపు సెలవు ప్రకటించాలి



పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీజీయూఎస్ నాయకులు

పరిగి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ జన్మదినం ఈ నెల 15న సాధారణ సెలవు రోజుగా ప్రకటించాలని కోరుతూ తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీయూస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రఘు, హరిశ్చందర్ మాట్లాడారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు నీల్‌సింగ్, రాములు, రమేశ్, లక్ష్మణ్, పాండు పాల్గొన్నారు.

**దుద్యాల:** గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా 15న ప్రభుత్వం సెలవు ప్రకటించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం దుద్యాల మండల నాయకులు గురువారం ప్రకటనలో కోరారు. ఉత్సవాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సెలవురోజుగా ప్రకటిస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి తిరుపతినాయక్ ఉన్నారు.

**తాండూరు:** యాడి బాపుగాడ్ దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజార ఆధ్యాత్మిక వేడుకలు 20వ తేదీన ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకుడు శ్రీ రామావత్ సురేంద్రనాయక్, శాంతబాయి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భోగ్ పూజ, బంజారా ధర్మ గురువు, పీఠాధిపతి శ్రీ బాబుసింగ్ మహారాజ్ ఆధ్యాత్మిక ప్రసంగం, బంజార ధర్మ రక్షణ సందేశం ఉంటుందని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యుడు



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట పాలక మండలి సభ్యుడు పాముకుంట్ల ప్రభాకర్‌గౌడ్ గురువారం ప్రతాప్‌సింగారంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని, మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్, నాయకులు కందుల కుమార్, నవీన్‌రెడ్డి, ఆశీష్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంగ్ల దినోత్సవం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంగ్ల దినోత్సవం నిర్వహించారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సరోజినీ నాయుడు చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాజరైన ఎంఈవో హరిలాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## మున్సిపల్ తాజా మాజీలకు సన్మానం

తాండూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ తాజా మాజీ ప్రజాప్రతినిధులను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో సన్మానించి ప్రసంగించారు. కార్యక్రమంలో తాజా మాజీ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ చైర్మన్లు లక్ష్మారెడ్డి, సునితాసంపత్, మాజీ కౌన్సిలర్లు సోమశేఖర్, మమత, బొంబిన, రామకృష్ణ(రాము), వెంకన్న గౌడ్, ప్రభాకర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ రత్నమాల పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. గురువారం స్థానిక మార్కెట్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే కులకచర్ల మార్కెట్ యార్డును అగ్రగామిగా నిలపుతామన్నారు. ఇచ్చిన హామీలను విడతలవారీగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు రైతు భరోసా హర్షణీయం

యాలాల, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రైతు భరోసా మంజూరు చేయడం హర్షణీయమని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ప్రభుత్వ ఉద్యోగులకు రైతు భరోసా అందించడంపై తమ కుటుంబ సభ్యులు తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలంగా లేకపోయినా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల విన్నపం మేరకు రైతు భరోసా నిధులను అందజేయడం అభినందనీయమన్నారు.

## సంక్షిప్తంగా..

**సీసీ కెమెరాలతో నేరాల అదుపు**

బషీరాబాద్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపులోకి వస్తాయని బషీరాబాద్ ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంతట్టి, మైల్వార్, బషీరాబాద్ తదితర గ్రామాల్లో పర్యటించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాజామాజీ ఎంపీపీ కరుణాఅజయ్‌ప్రసాద్ స్థానికంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50 వేల విరాళం ప్రకటించి అందజేశారు.

**ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలన**

పరిగి: పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో ఫలితాలు రాబట్టేలా విద్యార్థులను తయారు చేయాలని ఎంఈవో గోపాల్, ఇంటర్నల్ టీం సభ్యులు కృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పరిగిలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో ఇంటర్నల్ మార్కుల రికార్డులను పరిశీలించారు.

**దోమ ఎంపీడీవోగా గ్యమానాయక్**

దోమ: దోమ మండల ఎంపీడీవోగా గ్యమానాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్‌కు వారం క్రితం ఉన్నతాధికారులు ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. అయితే గురువారం నరేందర్‌ను ఎంపీడీవో బాధ్యతల నుంచి తప్పిస్తూ కీసర ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న గ్యమానాయక్‌కు దోమ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించడంతో చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయంతో నరేందర్‌ను ఎంపీడీవో బాధ్యతల నుంచి తప్పించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

**ఇన్‌చార్జి ఎస్ఐగా సంగమేశ్**

ధారూరు: ఇన్‌చార్జి ఎస్ఐ బాధ్యాతలను ఏఎస్ఐ సంగమేశ్‌కు అప్పగించామని సీఐ రఘురాం తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ ఈ నెల 11న ఏసీబీకి పట్టుబడటంతో ఆయనను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కొత్త ఎస్ఐని నియమించేవరకు సంగమేశ్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**ఉచితంగా కంప్యూటర్ శిక్షణ**

వికారాబాద్: మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఉర్దూ కంప్యూటర్ శిక్షణ నిర్వాహకుడు లాయక్‌అలీ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 79952 64997 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**17న ఇంటర్వ్యూలు**

పూడూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ, మండల పరిధిలోని ఎన్కెపల్లి టీజీఎంఎస్ పాఠశాలల్లో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్‌లను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు సంబంధిత అధికారులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఒక హెడ్ కుక్, రెండు మహిళా అసిస్టెంట్ కుక్ పోస్టులు, ఒక ఎన్కెపల్లి టీజీఎంఎస్ మహిళా అసిస్టెంట్ కుక్ పోస్టు ఉన్నట్లు వివరించారు. 10వ తరగతి పాసై ఉండి, ఎక్కువ మందికి వండగల సామర్థ్యం ఉండాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్ 7వ తరగతిపాసై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 17న ఉదయం 10గంటలకు పూడూరు కేజీబీవీ పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. స్థానికులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

**ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన**

దౌల్తాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్‌లో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏఎస్సై పుండరీకం హెచ్చరించారు. గురువారం మండలంలోని కొత్త కోల్కుందా గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది దత్తాత్రి, శ్రీనివాస్, మహేందర్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు సయ్యద్ యాకుబ్, శ్రీనివాస్, వీరేందర్, పద్మజచారి, ప్రవీణ, శ్రీలత, అంబిక పాల్గొన్నారు.

**చౌడాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. పరిగి సబ్ డివిజన్ షీటీం సభ్యులు మనిషా, శోభారాణి మహిళలపై జరుగుతున్న దాడులు, సైబర్ నేరాలు, నిర్భయ, పోక్సో చట్టం, డయల్ 100, షీటీం 181, ఆన్‌లైన్ మోసాలు, మత్తుపదార్థాల నిర్మూలనపై వివరించారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ అన్నారు. గురువారం మండలంలోని దామస్తాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. స్పీకర్‌కు ప్రజలు రుణపడి ఉంటారని, ఏమైనా సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మర్పల్లి మండలంపై ప్రత్యేక చొరవతో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. మండలంలో ఇప్పటివరకు రూ.4 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నాయకులు కలీముద్దీన్, నాగేశ్, రామేశ్వర్ ఉన్నారు.

## అనురాగ్‌లో పీఎంకేవీవైపై శిక్షణ పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న రెండో బ్యాచ్ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మూడురోజులపాటు కొనసాగిన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) శిక్షణ పూర్తయింది. జాతీయ నైపుణ్య అభివృద్ధి ద్వారా జీవశాస్త్ర రంగ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన పీఎంకేసీవై శిక్షణ కార్యక్రమంలో 40 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ వసుధభక్షి మాట్లాడుతూ ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఫార్మసీలో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాబా శంకర్‌రావు, వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

## రిమాండ్‌కు పాత నేరస్తులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వారెంట్లకు స్పందించకపోవడంతో పాత నేరస్తును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాల ప్రకారం. పాతకేసుల్లో నిందితులైన పాశం యాదిరెడ్డి, పాశం పద్మ కోర్టు వాయిదాల ప్రకారం కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఐదో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు న్యాయమూర్తి శిరీష వారిద్దరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఘట్‌కేసర్ పోలీసులు ఇద్దరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్ చేశారు.